# మీ పిలుపు విషయంలో రాజీపడవద్దు

ఆషిష్ రాయ్‌చూర్

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | పరిచయం | 1 |
| 2. | ఐహిక విచారములు | 3 |
| 3. | బంధించే బాంధవ్యాలు | 4 |
| 4. | చల్లబారిన ప్రేమ | 5 |
| 5. | అంగీకరింపబడాలనే ఆశ | 6 |
| 6. | దేవుని నడిపింపును అనుసరించు పద్ధతి | 7 |
| 7. | గొప్ప వెల | 8 |
| 8. | భయం – ఓ ప్రాణాంతకమైన శత్రువు | 10 |
| 9. | నిర్ణయం మీది | 12 |

# 1
# పరిచయం

మనలో ప్రతి ఒక్కరి కొరకు దేవుడు ఒక స్పష్టమైన యోచన కలిగియున్నాడు. మనలో చాలామంది దానిని నమ్ముచున్నాము మరియు మన జీవితాలపై ఉన్న ఆయన పిలుపే దేవుని స్పష్టమైన యోచన అని కూడా గ్రహించియున్నాము. ఇంకా, మన కొరకైన దేవుని ప్రణాళిక యొక్క నెరవేర్పు దానంతటదే జరగదనే వాస్తవము కూడా మనకు తెలిసినదే. మరియొక రీతిలో చెప్పాలంటే, మన జీవితాలపై నున్న దేవుని పిలుపును నెరవేర్చుటలో మన వంతు జరిగించాల్సిన బాధ్యతను మనము కలిగియున్నాం. వ్యక్తిగతంగా, దేవుని యోచనలు మనయందు మరియు మనద్వారా నెరవేర్చబడుటకు మనమాయనతో తప్పక సహకరించాలి.

దేవుడు మనల్ని ఏ పనిచేయుటకు పిలిచాడో, ఆ పని యొక్క ప్రాముఖ్యత లేక పరిమాణము అనేది ముఖ్యాంశము కాదుగాని, మనము నిజముగా ఆ పిలుపును నెరవేర్చుటే అతిముఖ్యమని గ్రహించాలి. బహుశా మనలో కొందరు 'గొప్ప' వాటిని చేయుటకు పిలువబడ్డారు; మరికొందరు 'చిన్న' వాటిని చేయుటకు పిలువబడ్డారు. కేవలం మనుష్యుల కనుదృష్టికి మాత్రమే అవి 'గొప్పవి' గా మరియు 'చిన్నవి'గా కనిపిస్తాయి. అయితే దేవుని దృష్టిలో 'గొప్పవి' మరియు 'చిన్నవి' రెండూ సమప్రాముఖ్యమైనవే. 'గొప్పవాటిని' చేయుటకు పిలువబడినవారు మరియు 'చిన్నవాటిని' చేయుటకు పిలువబడినవారు, తమ పిలుపును నెరవేర్చాలని దేవుడు ఆశక్తిని కలిగియున్నాడు. 'గొప్పవి' మరియు 'చిన్నవి' అనునవి ఒకదానిపై మరియొకటి ఆధారపడి ఉన్నాయి మరియు అంతర్గతంగా ఒక దానికి మరియొకటి లోబడి ఉన్నాయి. ఒకటి విఫలమైతే, ఆ ప్రభావం మరియొక దానిపై చూపిస్తుంది. ఉదా: గొప్ప జనసమూహములకు వాక్యాన్ని ప్రకటించే 'గొప్ప' సువార్తికుడు సౌండ్ సిస్టమ్ నిర్వహించే గుర్తింపులేని ఓ 'చిన్న' టక్నీషియన్ పై ఆధారపడియున్నాడు. ఒకవేళ టెక్నీషియన్ తన వంతు పనిని చేయుటలో విఫలమైనా లేక పనిని చక్కగా చేయకపోతే ఏమౌతుంది?

ఏమైనను, మనమందరం, 'గొప్ప' లేక 'చిన్న' వాటిని చేయుటకు పిలువబడినను దేవుని పిలుపును నెరవేర్చకుండునట్లు మనల్ని నిరోధించే సవాళ్లను ఎదుర్కొంటాము. అంతేకాక, దేవుని పిలుపును నెరవేర్చకుండునట్లు మనల్ని ఆటంకపరిచే అపవాది కూడా ఉన్నాడు. మనలో కొందరు ఆసక్తితో దేవుని యోచనను వెంబడింప మొదలుపెట్టి ఏవో కొన్ని కారణాలకు రాజీపడి ఆయన యోచనను అనుసరించుట యందు కొనసాగక,

మార్గమధ్యమున ఎక్కడో ఒకచోట ఆగిపోయారు. దేవుని రాజ్యమును వెంబడించుటకు బదులు విజయాన్ని, ఐశ్వర్యాన్ని లేక వ్యక్తిగత అభిలాషలను వెంబడించుటలో మన శక్తిని వ్యయపరస్తూ మనము దారితొలగిపోయి యుండవచ్చు. మనలో కొందరు పరలోకపు పిలుపుకు స్పందించనంత శ్రద్ధలేని వ్యక్తులుగా తయారగునట్లు జీవితం యొక్క అనుదిన వ్యవహారాలలో చిక్కుకున్నారు. మనకనుగ్రహింపబడిన ప్రభువు వాక్యము, పరిశుద్ధాత్ముడిచ్చిన కలలు మరియు దర్శనములు ఒక మూలకు పడవేయబడ్డాయి. భయం లేక అపనమ్మకమనే కారణంచేత అవి మరువబడ్డాయి లేక ఉద్దేశపూర్వకంగా అలక్ష్యం చేయబడ్డాయి. అయితే దేవుని పిలుపుకు స్పందించడానికి మనల్ని ప్రేరేపించుటే ఈ పుస్తకము యొక్క ఉద్దేశం. మంచి పోరాటము పోరాడక మరియు మన ఎదుట ఉంచబడిన పరుగు పందెమును కడముట్టించలేని స్థితికి మనల్ని దిగజార్చుటకు పొంచియున్న కొన్ని చిక్కు వలలు లేక పన్నాగముల గూర్చి మనలను మేలుకొల్పుటకు ఇది ఉద్దేశించబడింది.

## 2

# ఐహిక విచారములు

అపోస్తలుడైన పౌలు తనతోపాటు పనిచేసిన మరియు తనతో పరిచర్యలో సహపరిచారకులుగా ఉన్న అనేకమందిని గూర్చి తన పత్రికలలో వ్రాసాడు. వారిలో దేమాను గూర్చి పౌలు మూడు చోట్ల తెలియపరిచాడు. పౌలు ఫిలేమోనుకు వ్రాసిన పత్రికలో దేమాను తన “జతపనివాడుగా” తెలిపాడు (ఫిలేమోను 1:24). మరియు కొలస్సీయులకు శుభాకాంక్షలు పంపినప్పుడు అతని పేరును కూడా చేర్చాడు (కొలస్సీ 4:14). ఏమైనను, అతడు దేమాను గూర్చి ఆఖరిసారిగా వ్రాస్తూ “దేమా యిహలోకమును స్నేహించి నన్ను విడిచి థెస్సలోనీకకు వెళ్ళెను” (2తిమోతి 4:10) అని తెలిపాడు. అపోస్తలుడైన పౌలుతో భుజాలు రాసుకొని పరిచర్యచేసి మరియు అతని జతపనివాడుగా ఉండిన దేమా, తన పరిచర్యను మరియు అపోస్తలుడను విడిచిపెట్టి లోకానుసారమైన తన స్వంత యోచనలను వెంబడించునట్లుగా ఈ లోకముచేత మోసగించబడుట ఎంత దురదృష్టకరమైన విషయమో ఊహించండి!

మనమందరము ఐహిక విచారములు మరియు ఈ లోక ఆకర్షణల నుండి మన హృదయాలను కాపాడుకోవాలి. ఒకవైపు చూస్తే, మనము పరలోకపు పిలుపును వెంబడించాల్సిన అవసరతను విస్మరిస్తే బ్రదుకు సునాయాశంగా, సౌఖ్యంగా తయారవుతుంది. మరోవైపు చూస్తే, జీవితం మనల్ని ఎన్నో సమస్యలు మరియు చింతలతో ఉక్కిరిబిక్కిరి చేస్తుంది, సవాళ్లను జయించుటకు చేసే ప్రయత్నాలలో మనము విరామము లేకుండా తయారయ్యై విజయవంతులమవుతాము, కాని ఆ విధంగా దేవుని పిలుపును అలక్ష్యము చేస్తాం. “ఐహిక విచారములును, ధనమోసమును మరి ఇతరమైన అపేక్షలును లోపల చొచ్చి, వాక్యమును అణచివేయుట వలన అది నిష్ఫలమగును” (మార్కు 4:19) అని యేసు చెప్పెను. ఈ లోకం – దాని సమస్యలు లేక దాని సంతోషాలు దేవుడు మీ జీవితము కొరకు మీతో చెప్పిన మాటను దొంగిలింపనివ్వద్దు!

# 3

# బంధించే బాంధవ్యాలు

మనల్ని ప్రేమించి మరియు మన గూర్చి జాగ్రత్త వహించే కుటుంబాన్ని మరియు స్నేహితులను కలిగియుండటం ఆహ్లాదకరమే గాని, కొన్నిసార్లు ఇవే బాంధవ్యాలు మనల్ని బంధించి దేవుని పిలుపును వెంబడించకుండా అడ్డగిస్తాయి. ఎంతమంది యువతీయువకులు తమ తల్లి లేక తండ్రి యొక్క కోర్కెలను సంతోషపరచడానికి, తమ పరలోక పిలుపు విషయంలో రాజీపడి దేవుడు తమ జీవితాల కొరకెన్నడూ నిశ్చయించని వాటిని వెంబడింపలేదు. లూకా తన సువార్తలో ఈ క్రింది విషయాలను పొందుపరిచాడు: ఆయన మరియొకనితో "నా వెంట రమ్మని" చెప్పెను. "అతడు నేను వెళ్లి మొదట నా తండ్రిని పాతిపెట్టి వచ్చుటకు" సెలవిమ్మని మనవి చేసెను. అందుకాయన – "మృతులు తమ మృతులను పాతిపెట్టుకొననిమ్ము; నీవు వెళ్లి దేవుని రాజ్యమును ప్రకటించుమని" వానితో చెప్పెను. మరియొకడు –"ప్రభువా, నీవెంట వచ్చెదను గాని నా యింటనున్న వారి యొద్ద సెలవు తీసుకొని వచ్చుటకు మొదట నాకు సెలవిమ్మని అడుగగా", యేసు –"నాగటిమీద చెయ్యిపెట్టి వెనుకతట్టు చూచువాడెవడును దేవుని రాజ్యమునకు పాత్రుడు కాడని వానితో చెప్పెను" (లూకా 9:59-62).

దేవుని పిలుపును నెరవేర్చుటనునది కుటుంబ బాధ్యతల నెరవేర్పుకంటే ముందు స్థానాన్ని సంతరించుకోవాలి. అయితే మన కుటుంబములను అలక్ష్యము చేసి మరియు కుటుంబము పట్ల బాధ్యతారహితంగా ఉండేందుకు ఇదేమి ఒక లైసెన్స్ కాదు. మరి ముఖ్యముగా, ప్రాధాన్యతలను సరియైన క్రమములో పెట్టడమే ప్రాముఖ్యమైన విషయం. ప్రభువు పట్ల మరియు ఆయన రాజ్యము పట్లనున్న మన సమర్పణ భూసంబంధమైన సంబంధము లన్నిటికంటే ప్రథమ స్థానాన్ని తీసుకుంటుంది. "...ఎవడైనను నా యొద్దకు వచ్చి తన తండ్రిని, తల్లిని, భార్యను, పిల్లలను, అన్నదమ్ములను, అక్కచెల్లెంద్రను, తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు" (లూకా 14:26). దేవుని పిలుపును వెంబడించకుండా మనల్ని అడ్డగిస్తున్న బాంధవ్యాలు లేక స్నేహాలేవైనా ఉన్నాయా? బహుశా మనం సరియైన రీతిలోనే ప్రారంభించి యుంటాము, కాని హఠాత్తుగా, భూసంబంధమైన కొన్ని ఇతర సంబంధాల కన్నా యేసును తక్కువ ప్రాధాన్యత స్థానానికి నెట్టివేసియుంటాము ! విషయాలను క్రమములో పెట్టడానికి ఇది సరియైన సమయం !! భూసంబంధమైన సంబంధాల కోసం దేవుని పిలుపును మనము మరచిపోజాలము.

## 4

# చల్లబారిన ప్రేమ

దేవుని కొరకైన మీ ఆశ నేడు ఎంత ధృడముగా ఉంది? దేవుని కార్యాల కొరకు మరియు ప్రభువు యొక్క మందిరము కొరకు మీరు నిండు ఆసక్తితో ఉన్నారా? యేసుని గూర్చి ఇలా వ్రాయబడింది : "నీ యింటిని గూర్చిన ఆసక్తి నన్ను భక్షించియున్నది" (కీర్తనలు 69:9; యోహాను 2:17). దేవునిని వెదకుట మరియు ఆయనను సేవించుటనునది సౌకర్యానికి సంబంధించిన విషయమేనా అది ప్రాధాన్యతకు చెందినది కాదా? మీకు సమయం దొరికితేనే ప్రార్థిస్తారా లేక ప్రార్థించుటకు సమయాన్ని ప్రత్యేకిస్తారా? ఒక మతపరమైన ఆచారాన్ని నెరవేర్చుటచే మీ మనస్సాక్షిని తృప్తిపరచుటకు మాత్రమే చర్చికి వెళుతున్నారా లేక చర్చికి వెళ్లడం మీ సంతోషం కాబట్టి వెళుతున్నారా? "యెహోవా యొద్ద ఒక్క వరము అడిగితిని దానిని నేను వెదకుచున్నాను. యెహోవా ప్రసన్నతను చూచుటకును ఆయన ఆలయములో ధ్యానించుటకును నా జీవితకాలమంతయు నేను యెహోవా మందిరములో నివసింపగోరుచున్నాను" (కీర్తనలు 27:4) అని కీర్తనకారుడు తన హృదయాన్ని వ్యక్తపరిచాడు. అయితే మీరు ప్రభువును ప్రేమిస్తున్నారని చెప్పవచ్చు కాని అగ్ని ఇదివరకుండినంత తీవ్రముగా లేదు! దీనిని చల్లబారిన ప్రేమ అని చెప్పవచ్చు- ఈ ప్రేమ సుఖముగా ఉన్నవాటినే చేస్తుంది తప్ప ఆయన ఆజ్ఞాపించే వాటిని కాదు. మీరొకవేళ ఆయన ఏమి ఆజ్ఞాపించునో వాటిని కాక సుఖముగా ఉన్నవాటిని మాత్రమే చేసినయెడల మీరెన్నటికీ ఆయన పిలుపును నెరవేర్చలేరు.

మనము దేవుని పిలుపును నెరవేర్చదల్చిన, మన పూర్ణహృదయముతో, ప్రాణంతో, మనస్సుతో మరియు బలమంతటితో ప్రభువును ప్రేమించాలి (మార్కు 12:30). మన పూర్ణహృదయంతో ఆయనను వెదకుటకు మనల్ని మనమే ప్రేరేపించుకోవాలి. మన జీవితంలో ఉత్తమమైన దానిని ఆయనకిచ్చుటకు మనము చేయువాటిని సంపూర్ణముగా జరిగించాలి.

# 5

# అంగీకరించబడాలనే ఆశ

మన జీవితాలపైనున్న దేవుని పిలుపును వెంబడిస్తున్నందున మనల్ని అందరూ పొగడరు, అభినందించరు మరియు మెచ్చుకొనరు. మనము కేవలం ప్రజల దృష్టిలో మరియు మనకు సన్నిహితంగా ఉన్నవారి దృష్టిలో సహితం అంగీకరించబడుటకు జీవించిన యెడల మనము భంగపడతాము. అప్పుడు, దేవుడు మనల్ని చేయమని కోరుతున్న వాటిని చేయుటకు స్వతంత్రత కలిగియుండము. మన పరలోకపు తండ్రిని సంతోషపరచుటయే మన ప్రాధాన్యత కావాలి. యేసు చెప్పెను, "అద్వితీయ దేవుని వలన వచ్చు మెప్పును కోరక యొకని వలన ఒకడు మెప్పుపొందుచున్న మీరు ఏలాగు నమ్మగలరు?" (యోహాను 5:41,44). చాలామంది ప్రజలు తమ జీవితాలపై నున్న దేవుని పిలుపు విషయంలో రాజీపడతారు, ఎందుకంటే వారు సంస్థలను లేక ఇతరులను సంతోషపెట్టే స్థితిలో తమనితాము ఉంచుకుంటారు (శాఖలను సహితం). కాబట్టి, దేవుడు వారిని ఓ సరిక్రొత్త కార్యాన్ని, విభిన్నమైన విషయాన్ని మరియు ఇతరులు అబ్బురపోయే విషయాన్ని చేయుటకు పిలిచినప్పుడు, తిరస్కరించబడతామనే భయాన్ని బట్టి వాటిని చేయుటకు అడుగు ముందుకు వేయలేరు మరియు విధేయత చూపించలేరు. దైవభక్తిగల ప్రజలు సమ్మతించకపోయినను మనకు నచ్చిన వాటిని చేయడమనే తెలివితక్కువతనాన్ని మేము ప్రభోధించుటలేదు. మనుష్యుల వలన వచ్చే మెప్పుకన్నా దేవునికి విధేయత చూపించుటను అంశమును ఉన్నతమైనదిగా దృష్టించుటను గూర్చి మనము మాట్లాడుచున్నాము. నేడు మీరెక్కడున్నారు? మనుష్యుల దృష్టిలో మెప్పు పొందాలని ఆశించక దేవుడు మిమ్మల్ని దేనిని చేయమన్నా దానిని మీరు చేయగలరా?

# 6

# దేవుని నడిపింపును అనుసరించు పద్ధతి

మన జీవితాల ఉద్దేశము గూర్చి మాత్రమే కాదుగాని, ఆ ఉద్దేశ గమ్యాన్ని ఏలా చేరుకోవాలనే దైవిక నడిపింపును గూర్చి కూడా మనము పరలోకము నుండి వినవలసిన అవసరతయున్నది. మన ఆలోచనలతో చేసిన పద్ధతులతో పరలోకపు పిలుపును నెరవేర్చలేము. పిలుపు మరియు దానిని నెరవేర్చే విధానము రెండూ తప్పక దేవుని వద్దనుండే రావలెను. అపోస్తలుడైన పౌలు ఇలా వ్రాసాడు. “అయినను తల్లి గర్భమునందు పడినది మొదలుకొని నన్ను ప్రత్యేకపరచి, తన కృపచేత నన్ను పిలిచిన దేవుడు నేను అన్యజనులలో తన కుమారుని ప్రకటింపవలెనని ఆయనను నాయందు బయలుపరప నను(గ్రహించినపుడు మనుష్యమాత్రులతో నేను సంప్రతింపలేదు” (గలతీ 1:15,16). దేవుని పిలుపును నెరవేర్చే క్రమంలో మనం చేసే – ఆలోచనలు, పాటించే పద్ధతులు, కార్యకలాపాలు మరియు ప్రణాళికలు ఇవన్నీ మన స్వంత క్రియలా లేక అవి దేవుడు మన హృదయంలో పెట్టినవా? అవి పరలోకము నుండి వచ్చాయా లేక మనుష్యమాత్రుని నుండి వచ్చినవా? వాటి వెనుక ఉన్న తలంపులేమిటి? మనము ఆత్మను అనుసరిస్తున్నామా లేక మనిషిని అనుకరిస్తున్నామా?

మన ఆలోచనలను పరిశుద్ధాత్ముని యొక్క నడిపింపుకు లోబర్చవలసిన అవసరతయున్నది. ప్రభువును సేవించుటకు మరియు ఆయన రాజ్యము కొరకు పనిచేయుటకు మనము తప్పక ఆసక్తి కలిగియుండాలి, అయితే ఈ ఆసక్తిని పరిశుద్ధాత్ముని యొక్క నడిపింపుకు లోబరచవలెను. ఇతరులు ‘వెళుతున్నారు’ గనుక లేక మనల్ని ఎవరో ‘వెళ్ళమన్నారు’ కాబట్టి మనము ‘వెళ్ళ’ కూడదు. దేవుడు మనల్ని పంపిస్తున్నాడు కాబట్టి మనము ‘వెళ్ళాలి’ మరియు ఆయన మనల్ని ఎక్కడికి పంపిస్తే అక్కడికి వెళ్ళాలి. మార్గములో వేసే ప్రతీ అడుగు ఆయన నడిపింపును బట్టి వేయుటయే దేవుని పిలుపును నెరవేర్చుటకు తాళపు చెవియైయున్నది.

# 7

# గొప్ప వెల

వెల లేకుండా దేవుని పిలుపు ఉండదు. దేవుని పిలుపును వెంబడించడానికి చేయాల్సిన త్యాగాలు, సాహసాలు, సహించవలసిన హింసలు, కఠిన శ్రమలు మరియు ఇంకా ఎన్నో ఉన్నాయి. యేసును వెంబడించుటకు అయ్యే వెలను గూర్చి ఆయన మాట్లాడెను. వెలను లెక్కించమని ఆయన మనకు చెప్పాడు.

**"మీలో ఎవడైనను ఒక గోపురము కట్టింపగోరిన యెడల దానిని కొనసాగించుటకు కావలసినది తన యొద్ద ఉన్నదో లేదో అని కూర్చుండి తగులుబడి మొదట లెక్క చూచుకొనడా? చూచుకొనినయెడల అతడు దాని పునాది వేసి, ఒకవేళ దానిని కొనసాగింప లేకపోయినందున చూచువారందరు – ఈ మనుష్యుడు కట్ట మొదలుపెట్టెను గాని కొనసాగింప లేకపోయెనని అతని చూచి యెగతాళి చేయసాగుదురు. మరియు ఏ రాజైనను మరియొక రాజుతో యుద్ధము చేయబోవునప్పుడు తనమీదికి ఇరువదివేల మందితో వచ్చువానిని పదివేలమందితో ఎదిరింప శక్తి తనకు కలదో లేదో అని కూర్చుండి మొదట ఆలోచింపడా? శక్తిలేని యెడల అతడింకను దూరముగా ఉన్నప్పుడే రాయబారము పంపి సమాధానము చేసికొనచూచును గదా? ఆ ప్రకారమే మీలో తనకు కలిగినదంతయు విడిచిపెట్టనివాడు నా శిష్యుడు కానేరడు" (లూకా 14:28-33).**

యేసుని వెంబడించుటకు అయ్యే వెల ఏమిటి? సమస్తం ! మనకు కలిగినదంతయు విడిచిపెట్టవలెనని యేసు చెప్పెను. 'విడిచిపెట్టుట' అంటే ఇకమీదట అది మనది కాదని అర్థం. మనము కలిగియున్నదంతా దేవుని సొంతం, ఆయన దానితో ఏమి చేయగోరుతున్నాడో వాటిని చేయమని ఆయన మనకు చెపుతాడు. మనమేమి కలిగియున్నాం లేక ఎంత కలిగియున్నామని కాదు. మనము దానినంతటిని ప్రభువుకు విడిచిపెట్టామా? లేక విడిచిపెట్టమని, వదిలివేయమని, ఓ ప్రక్కన పెట్టమని, వాటితో ఇక పనిలేదని దేవుడు చెప్పిన విషయాలు – అనగా హక్కులు, యోచనలు, కలలు, కోరికలు, సంబంధాలు, అలవాట్లు – ఇవేవైనా మన జీవితాల్లో ఉన్నాయా, వాటిని విడిచిపెట్టుట మనకు కష్టంగా ఉందా? మన ధనం దేవుని సొంతమా లేక అది కేవలం మనకు మాత్రమే సొంతమా? మనము కలిగియున్న ధనముతో దేవుడు చేయగోరుతున్న వాటిని మనకు చెప్పుటకు ఆయన మన ధనం విషయంలో స్వేచ్ఛ కలిగియున్నాడా? ఆయన విత్తనాలను ఎక్కడ విత్తాలనుకుంటున్నాడో అక్కడ విత్తుటకు మనము సముఖంగా ఉన్నామా? మనమెంత విడిచిపెట్టామన్నది ముఖ్యాంశము

కాదుగాని మనమేది విడిచిపెట్టమో అది – మనము దేవుని పిలుపును నెరవేరుస్తామా లేక నెరవేర్చలేమా అను విషయాన్ని నిర్ధారిస్తుంది. కొంతమంది ఎంతో విడిచిపెట్టారు కాని ఇంకా కొన్ని చిన్నచిన్న విషయాలున్నాయి, అవే తమ జీవితాలపై నున్న దేవుని పిలుపు యొక్క సంపూర్ణతలోనికి ప్రవేశించకుండా వారిని ఆటంకపరుస్తున్నాయి. మనము విడచిపెట్టిన అన్నిటి యొక్క విలువ కన్న ఆ కొన్ని విషయాలను విడిచిపెట్టుట యొక్క విలువ ఎంతో ఎక్కువ. అయితే ప్రభువు దీనిని చేయమనే అడుగుచున్నాడు ! చెల్లించాల్సిన వెల చాలా గొప్పదేనా ? మన జీవితాలపై తండ్రి అధికారాన్ని అంగీకరించుట యొక్క బహుమానము బహు గొప్పదని జ్ఞాపకముంచుకొనండి ! మీ జీవితంపై నున్న దేవుని పిలుపును నెరవేర్చుటకు మీరు వెలను చెల్లిస్తారా?

# 8

# భయం - ఓ ప్రాణాంతకమైన శత్రువు

చాలామంది ప్రజలు తమకున్న - ఓటమనే భయం, భవిష్యత్తును గూర్చిన భయం, లేమి అనే భయం, మనుష్యుల భయం కారణంచే తమ జీవితాలపైనున్న దేవుని పిలుపు విషయంలో రాజీపడతారు. భయం వారిని బంధించినందున వారు అడుగు ముందుకు వేసి దేవుని పిలుపు యొద్దకు చేరుకొనలేరు. కొందరు, “దేవుడు నన్ను ఫలానా స్థలానికి వెళ్లి సంఘాన్ని స్థాపించమని కోరుచున్నాడు, నేకొకవేళ సఫలీకృతుడను కాకపోతే ? ఒకవేళ సంఘం ఎన్నటికీ అభివృద్ధి చెందకపోతే? అప్పుడు పరిస్థితి ఏమిటని ఆలోచిస్తుండవచ్చు. ఓడిపోతామనే భయం వారిని కనీసం అడుగు కూడా ముందుకు వేయనియ్యదు. మనల్ని విజయవంతులను చేసేది దేవుడేనని మనము తప్పక జ్ఞాపకముంచుకోవాలి (2కొరింథీ 2:14). కాబట్టి, మనము నమ్మికను దేవునిపై ఉంచుదాం. మనము విజయాన్ని మరియు ఓటమిని దేవుని దృష్టికోణములోనుండి చూడాల్సియుంది. దేవుని చిత్తాన్ని జరిగించి మరియు ఆయన మనల్ని చేయమని ఆజ్ఞాపించిన వాటిని నెరవేర్చుటయే విజయం లేక సఫలీకరించడం. సఫలీకృతమనునది సాధించిన విషయాలు లేక సంఖ్య లేక పేరుప్రఖ్యాతల యందు లేదు.

కొంతమంది భవిష్యత్తును గూర్చిన భయంచే బంధింపబడ్డారు. వారు ఇలా ఆలోచిస్తారు, “దేవుడు నన్నిప్పుడు చేయమని చెప్పిన దానిని చేస్తాను, మరి దాని తరువాత సంగతేమిటి?” వారు భవిష్యత్తును చూడలేరు కాబట్టి భయపడ్డారు. దేవుడు మనకు సమస్తమును ఒక్క తరుణంలోనే చూపించడు. ఆయన మనల్ని అడుగు తరువాత అడుగు వేయించి నడిపిస్తాడు. దేవునికి ఆద్యంతాలు తెలుసు. ఒకదాని తరువాత ఏమి వస్తుందో ఆయనకు తెలుసు. మనము ఏమి చేయాలంటే, ఆయనను ఆశ్రయించి జీవితం యొక్క ప్రస్తుత గడియలో ఆయన మనల్ని చేయమని కోరిన దానిని చేయాలి. ప్రణాళికలు వేయడం ముఖ్యమే కాని దేవునికి విధేయత చూపించడం బహు ప్రాముఖ్యమైనది. కొన్నిసార్లు ప్రభువు యొక్క వాక్యము మరియు ఆయన సూచనలు మనము ఆలోచించిన ప్రణాళికలో ఇమడవు. కాని, మనము తప్పక విధేయత చూపాలి!

కొందరు లేమిని గూర్చిన భయంతో బంధింపబడ్డారు. దేవుడు చేయమని పిలచిన పనిని చేస్తే తమ అనుదిన అవసరతలు తీరవేమో అని వారి భయం. “దేవుని యందు విశ్వాసముంచుడి” (మార్కు 11:22) అని యేసు చెప్పెను. అనుగ్రహిస్తానని దేవుడు వాగ్ధానం చేసాడు. ఆయన వాక్యమందలి విశ్వాసం మీ హృదయంలో నుండి

భయాన్ని భయటకు విసిరివేయనియ్యండి !

మరికొందరు మనుష్యుల భయంచే బంధించబడ్డారు. హింసించే వారిని బట్టి మరియు కొన్నిసార్లు ఇతర పరిచారకులను బట్టి కూడా భయపడుతుంటారు – వీరు ఇతరులను చూసి భయపడుతుంటారు. “మనుష్యులకు భయపడుట వలన ఉరి వచ్చును, యెహోవా యందు నమ్మిక యుంచువాడు సురక్షితముగా నుండును” (సామెతలు 29:25) అని బైబిల్ చెప్పుచున్నది. దేవునియందు నమ్మికయుంచుటచే, మిమ్మల్ని పట్టుకొని వెనక్కిలాగుతున్న భయానికి విరుద్ధంగా మీరు అడుగు ముందుకు వేయగలరు. యెహోషువ నాయకత్వమును చేపట్టినప్పుడు ప్రభువు అతనికి ఏమి చెప్పెనో జ్ఞాపకము చేసుకొనండి. “నేను నీ కాజ్ఞయిచ్చియున్నాను గదా, నిబ్బరము కలిగి ధైర్యముగా నుండుము, దిగులుపడకుము, జడియకుము. నీవు నడుచు మార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుండును” (యెహోషువ 1:9). ప్రభువునందు ధైర్యము కలిగియుండుము. దేవునియందలి మీ విశ్వాసం ఆయన పిలుపుకు లోబడునట్లు మిమ్మును స్వతంత్రులను చేయును గాక !!

# 9

# నిర్ణయం మీది

మనము దేవునితో నడచుటలో ఉన్న ఒక అద్భుతమైన సంగతేమనగా, ప్రభువును వెదకుటకు మరియు అలా కొనసాగుటకు మనము మన హృదయాలలో ఉద్దేశించుకొనగల్గుట. మనము పశ్చాత్తాపపడగలం మరియు మార్పునొందగలము. మనము దేవునితో ముందుకు కొనసాగగలం. వాస్తవానికి, మనమదే చేయాలి. అయితే, మనము తప్పుడు నిర్ణయాలు తీసుకొని, రాజీపడి మరియు సమస్యలో పడినప్పటికీ ప్రభువు మనల్ని బయటకు తెచ్చుటకు సమర్థుడు. "నాశనకరమైన గుంటలో నుండియు జిగటగల దొంగ ఊబిలో నుండియు ఆయన నన్ను పైకెత్తెను. నా పాదములు బండమీద నిలిపి నా అడుగులు స్థిరపరచెను" (కీర్తన 40:12). అని కీర్తనకారుడు చెప్పాడు. మనము చేయాల్సిన ప్రాముఖ్యమైన సంగతేమనగా, మన జీవితాలను సత్యపూర్వకముగా పరీక్షించుకొని మరియు అవసరమైన చోట్ల మార్పు నొందుటకు దేవుని బలమును పొందుకోవాలి.

మీ పిలుపు విషయమై రాజీపడ్డారా? మీ హృదయమంతటితో దేవుని పిలుపును వెంబడిస్తున్నారా? మీ జీవితాలపై నున్న దేవుని పిలుపుతో మిమ్మును సంపూర్తిగా క్రమపరచు కొనుటకు నేడు మీకు ఏ మార్పులు అవసరం?

మనకు అవకాశం ఉంది. మనం ఈ జీవితాన్ని నిర్మలంగా కొనసాగించవచ్చు, రక్షించబడి యుండవచ్చు, అయినప్పటికీ మన పూర్ణహృదయంతో దేవుని పిలుపును వెంబడించకుండ మనం పరలోక రాజ్యాన్ని సంపాదించుకుంటే, మనతో పాటు నిత్యత్వములోనికి తీసుకొని వెళ్లుటకు ఏ ఫలము ఉండదు. మరోవైపు, మన జీవితాలపై నున్న దేవుని పిలుపును వెంబడించుటకు మరియు వెదకుటకు అవసరమైన ప్రతికార్యాన్ని మనం చేయవచ్చును. ఈ భూమిపై మనం వెట్టివాళ్ళలా కనిపించవచ్చు. ఏమైనను, మనం పరలోకానికి వెళ్లినప్పుడు మన పని అగ్నిచేత పరీక్షించబడుతుంది, నిత్యత్వమంతటా నిలిచిపోయే ఫలాన్ని మనం కలిగియుంటాము. అపోస్తలుడైన పౌలు తిమోతిని హెచ్చరిస్తూ ఇలా చెప్పాడు, "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్తపడుము" (2తిమోతి 2:15). దేవునిచే యోగ్యుడైన మరియు సిగ్గుపడనక్కరలేని పనివారమగుటకు మనవంతు ప్రయాస దీనికి అవసరం. దేవుని పిలుపును

నెరవేర్చుటకు మనల్ని మనం సిద్ధపరచుకొనుటకు సమయం మరియు ప్రయాస తప్పనిసరి. అంతేగాక త్యాగాలు మరియు సాహసాలు కూడా చేయవలసి ఉంటాయి. అయితే మనము అత్యున్నతమైన రీతిలో చేయాలి.

ఈ చివరి గడియలో, దేవుని పిలుపుకు నూరు శాతం అప్పగించుకున్న స్త్రీ పురుషులు దేవునికి కావాలి. దేవునికి పూర్తిగా అమ్మివేసుకున్న ప్రజలు ఆయనకు కావాలి – ఈ ప్రపంచ విషయాలకై రాజీపడని ప్రజలు ఆయనకు అవసరం.

అపోస్తలుడైన పౌలు మాటలతో మిమ్మును మేము ప్రోత్సాహించ కోరుచున్నాము :

**“ఇదివరకే నేను గెలిచితిననియైనను, ఇది వరకే సంపూర్ణ సిద్ధి పొందితినని యైనను నేను అనుకొనుట లేదుగాని, నేను దేని నిమిత్తము క్రీస్తుయేసుచేత పట్టబడితినో దానిని పట్టుకొనవలెనని పరుగెత్తుచున్నాను. సహోదరులారా, నేనిది వరకే పట్టుకొని యున్నానని తలంచుకొనను. అయితే ఒకటి చేయుచున్నాను, వెనుక ఉన్నవి మరచి ముందున్న వాటి కొరకై వేగిరపడుచు క్రీస్తుయేసు నందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని, గురియొద్దకే పరుగెత్తుచున్నాను” (ఫిలిప్పీ 3:12–14).**

యేసు మిమ్మును దేని కొరకు పట్టుకున్నాడో దానిని పట్టుకొనుటకై మీరు పరుగెత్తండి. గురియొద్దకే పరుగెత్తండి. మీ పరలోకపు పిలుపునందు పరుగెత్తండి. దీనికి కొంత ప్రయాస అవసరమే కాని ఇది యోగ్యమైనది, విలువైనది ! మీ జీవితంపై నున్న దేవుని పిలుపు విషయంలో రాజీపడవద్దు !!

# ఆల్ పీపుల్స్ చర్చ్ యొక్క ప్రచురణలు

1. మార్పు
2. పని యెడల బైబిల్ పరమైన దృష్టి విధానము
3. క్రీస్తునందు మనమెవరము ?
4. శుద్ధిచేయువాని అగ్ని
5. సమర్పణ యొక్క శక్తి
6. మీ పిలుపు విషయములో రాజీపడవద్దు
7. ఆత్మసంబంధమైన మనస్సు కలిగియుంటూ మరియు లోకసంబంధంగా వివేకముగా యుండుట

# ఆల్ పీపుల్స్ చర్చ్ గురించి

బెంగుళూరు పట్టణానికి ఉప్పుగాను మరియు వెలుగుగాను ఉండాలని మరియు భారత దేశానికి మరియు ఇతర దేశాలకు దేవుని స్వరముగా ఉండాలనునది ఆల్ పీపుల్స్ చర్చ్ యొక్క దర్శనం.

ఇది మీకు మేమందిస్తున్న ఒక బహుమానం! ఇది ఉచితం!

ఈ పుస్తకాన్ని చదువుట ద్వారా మీరు ఆశీర్వదింపబడ్డారని మేము నమ్ముచున్నాము.

మీ వలె కొన్ని వేలమందికి ఈ పుస్తకాలు ఉచితముగా పంచబడ్డాయి. దేవుని వాక్యమును అనేకులతో పంచుకొనుటకు గాను, మీరు ఆర్థికంగా సహాయపడి మాతో భాగస్థులు కావలెనని ఆశించుచున్నాము. క్రమముగా మీరు ఇచ్చే ఆర్థిక సహకారము ఇతరులకు దేవుని వాక్యాన్ని అందజేయుటకు దోహదపడుతుంది. ప్రభువు మిమ్మును నడిపించిన ప్రకారము ఆల్ పీపుల్స్ చర్చ్‌తో భాగస్వాములు అవ్వండి. మీరు మీ ఆర్థిక సహాయాన్ని చెక్కు/డిమాండు డ్రాఫ్ట్/ మనియార్డరు ద్వారా "All Peoples Church, Bangalore" పేరుతో పంపగలరు.

మీరు మాకు లెటర్ వ్రాసేటప్పుడు ఇతర ప్రచురణలను కొరకు అడుగగలరు. మీ అభిప్రాయములు, ప్రార్థన అవసరతలతో పాటు ఈ పుస్తకం మీకు ఏలా సహాయపడిందో కూడా తెలియపరచండి. ఈ క్రింది చిరునామా ద్వారా మాతో సంప్రదించగలరు :

ALL PEOPLES CHURCH,
370, 11th Cross, 2nd Block,
R.T. Nagar, Bangalore-560 032
Karnataka, INDIA.

Phone : 91-80 2354 4328
Email: contact@apcwo.org.
Website: www.apcwo.org